

చీనీ టన్ను రూ.17,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,500 పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.23 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/23.1°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌లో పతకాల పంట పండాలి



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటి పతకాల పంట పండించాలని కలెక్టర్ చేతన్ ఆకాంక్షించారు. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో ఇప్పటికే దేశానికి 3 పతకాలు రావడం ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. ఒకే ఈవెంట్‌లో మనుబాకర్, సరబ్‌జీత్ సింగ్, స్వప్నిల్ కుసాలేలు పథకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ విజయం మన అథ్లెట్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది కృషి, అంకిత భావానికి నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో ఒలిపింక్స్‌లో మన దేశం అగ్రదేశాల సరసన నిలవాలని, ఇందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఒలింపిక్స్ లోగోను ఆవిష్కరించి ప్రదర్శనకు ఉంచారు.

ఆర్టీసీ 'హనుమాన్ దర్శన్'

- జిల్లా నుంచి ప్రత్యేక సర్వీసులు
- ఒకే రోజు మూడు క్షేత్రాల దర్శనం



కరపత్రాలు విడుదల చేస్తున్న డీపీటీఓ మధుసూదన్, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: శ్రావణ మాసంలో మురడి, నేమకల్లు, కసాపురం క్షేత్రాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 'హనుమాన్ దర్శన్' పేరితో ఆగస్టు 6 తేదీ నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. శ్రావణ మాసంలో జిల్లాలోని అన్ని డిపోల నుంచి హనుమాన్ దర్శన్ సర్వీసులు నడుపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో డిపో మేనేజర్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి 'హనుమాన్ దర్శన్' బస్ సర్వీసుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రావణ మాసంలో జిల్లాకు చెందిన వారు ఎక్కువగా మురడి, నేమకల్లు, కసాపురం క్షేత్రాలకు వెళ్లి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారని, వారి సౌకర్యార్థం ఈనెల 6, 13, 20, 27 (మంగళవారం), అలాగే 10, 17, 24, 31 తేదీల్లో (శనివారం) జిల్లాలోని అన్ని బస్‌డిపోల నుంచి హనుమాన్ దర్శన్ సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ముందస్తు రిజర్వేషన్ కోసం బస్టాండుల్లోని కౌంటర్లలో సంప్రదించాలని, లేదా www.apsrtc.online.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్ టికెట్లు పొందవచ్చన్నారు.

ఎలుగుబంటి హల్‌చల్



రోడ్డు మధ్యలో నిలబడిన ఎలుగుబంటి

కంబదూరు: మండలంలోని మంద – కుర్లపల్లి రహదారి మధ్యలో శుక్రవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. సమీపంలోని కొండల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి రోడ్డుకు మధ్యలో నిలబడిపోయింది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, రైతులు భయందోళనకు గురయ్యారు. అక్కడి నుంచి ఎంతసేపటికీ ఎలుగుబంటి పక్కకు కదలక పోవడంతో చివరకు వాహనదారులు హారన్ల మోతతో బెంబేలెత్తించడంతో సమీపంలోని పొలాల్లోకి వెళ్లిపోయింది. ఇటీవల ఎలుగుబంట్లు తరచూ జనవాసాల్లోకి ప్రవేశిస్తున్నాయని, అటవీ శాఖాధికారులు స్పందించి తక్షణమే ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టాలని పలువురు కోరారు.

ఇంటింటికీ రేషన్ లేనట్టే!

'చౌకధరల దుకాణాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ మూర్ఖపు పథకం'
– బాధ్యతలు చేపట్టగానే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలివి.

రేషన్ డీలర్‌షిప్ ఇప్పిస్తా తీసుకో. బాగా మిగులుతుంది. ఈ నెల నుంచి ఎండీయూ వాహనాలు కూడా ఉండవు. ఏ అధికారీ నీ వైపు రాకుండా నేను చూస్తా. నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చు.
– హిందూపురానికి చెందిన ఓ కార్యకర్తకు టీడీపీ నేత సూచన ఇది.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు రూ.5.80 లక్షల విలువైన వాహనాన్ని బ్యాంకు రుణంతో ఇప్పించింది. ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి రేషన్ అందిస్తున్నాం. బ్యాంకు కంతు మేము నెలకు రూ.3 వేలు చెల్లిస్తుండగా... మరో రూ.8 వేలు ప్రభుత్వం కడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీల నేతలంతా రేషన్‌షాపుల్లోనే సరుకులు ఇస్తారని చెబుతున్నారు. అప్పుడు మా పరిస్థితి ఏమిటో. ఆ వాహనాలు ఏం చేసుకోవాలో...బ్యాంకు కంతులు ఎలా చెల్లించాలో తెలియడం లేదు.

...మడకశిరకు చెందిన ఎండీయూ వాహనం డ్రైవర్ ఆవేదన ఇది. తాజా పరిణామాలు, పౌరసరఫరాలశాఖ మంత్రి, కూటమి నేతల వ్యాఖ్యలతో జిల్లాలోని ఎండీయూ వాహన నిర్వాహకులంతా ఆందోళన చెందుతున్నారు.



- ఎండీయూ వాహనాలకు మంగళం
- రేషన్ డీలర్ల కోసం కూటమి సర్కార్ నిర్ణయం
- ఒక్కొక్క పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు

1,367 జిల్లాలోని రేషన్ దుకాణాలు	5,62,784 జిల్లాలో రేషన్‌కార్డులు
349 వైఎస్సార్ హయాంలో రేషన్ పంపిణీ చేసిన వాహనాల సంఖ్య	8,700 (మెట్రిక్ టన్నులు) ప్రతినెలా కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం

సాక్షి, పుట్టపర్తి

పేదలు, వృద్ధులు, మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేర్చింది. ముఖ్యంగా కార్డుదారులు ఇబ్బందులు పడకుండా మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేసింది. దీంతో రేషన్ వృద్ధులు, దివ్యాంగులకు ఎంతో మేలు జరిగింది. కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకానికి మంగళం పాడేందుకు సిద్ధమైంది. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలను రేషన్ డీలర్లుగా నియమించి వారికి లబ్ధి చేకూర్చేందేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఎండీయూ వాహనాలను పక్కన పెట్టేందుకు సిద్ధమైంది. అదే జరిగితే మళ్లీ రేషన్ షాపుల వద్ద జనం బారులు తీరాల్సి ఉంటుంది.

నిర్వీర్యం దిశగా అడుగులు..

ఇంటింటికీ రేషన్ అందించడం వల్ల దివ్యాంగులు, వృద్ధులకు మేలు జరుగుతుందని, రేషన్ సరుకుల కోసం ఎవరూ పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉండదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. అధికారంలోకి రాగానే (ఎండీయూ) ద్వారా ప్రజాపంపిణీలో నవశకానికి నాంది పలికారు. మన రాష్ట్రంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ విధానాన్ని దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి. పేదలకు ముంగిళ్లలో సేవ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూపొందిన పథకం గడచిన ఐదేళ్లుగా విజయవంతంగా అమలు చేశారు. కానీ తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

పకడ్బందీగా నడిచిన పథకం..

పేదలకు దూరాభారం, రేషన్ దుకాణంలో డీలర్ ఉంటేనే సరకులు.. లేదంటే కష్టమనే పద్ధతికి స్వస్తి పలికేందుకు జగన్ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీకి 2021లో శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17 వరకూ ఈ పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో పంపిణీ చేసింది. రేషన్ పంపిణీని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడంతో పథకం పకడ్బందీగా నడిచింది. అలాగే రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా ఎండీయూలకు సరకులను సరఫరా చేసే బాధ్యతలను ఆయా డీలర్లకు అప్పగించారు. దీంతో యువతకు ఉపాధి దొరికింది. ప్రజలకు నేరుగా ఇంటికే రేషన్ సరుకులు అందాయి. డీలర్లకూ ఎలాంటి ఇబ్బందీ కలగలేదు.

2027 వరకూ ఒప్పందం..

ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీలో భాగంగా ఎండీయూ నిర్వాహకులకు 2027 వరకూ ఒప్పందం ఉంది. వాహనాల వాయిదాలు సైతం అప్పటి వరకూ చెల్లించాల్సి ఉంది. ఎండీయూ వాహనం ధర రూ.5.80 లక్షలు కాగా, అందులో 10 శాతం లబ్ధిదారులు చెల్లించారు. మిగిలినది ప్రభుత్వం చెల్లించింది. ఎండీయూ నిర్వాహకుడు నెలకు రూ.3 వేలు చెల్లిస్తుండగా, మిగిలిన రూ.8 వేలు ప్రభుత్వం బ్యాంకులకు కంతు రూపంలో చెల్లిస్తోంది. ఈ పథకాన్ని రద్దు చేస్తే ఈ ఒప్పందాన్ని ఏం చేస్తారని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. తమ ఉపాధిని దెబ్బ తీయవద్దని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన 'ఇంటివద్దే రేషన్' పథకాన్ని కొనసాగించాలి. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ బియ్యాన్ని అందజేయాలి. దీంతో దివ్యాంగులు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుంది. రేషన్ షాపు వరకూ వెళ్లే తిప్పలు తప్పుతాయి. ప్రభుత్వం ఆలోచించి ఎండీయూ వాహనాలను కొనసాగించాలి.
– రంగారెడ్డి, బీడుపల్లి

బియ్యం ఇంటి వద్దే అందజేయాలి



రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటివద్దే అందజేయాలి. రేషన్ దుకాణాల వద్ద సరుకులిస్తే గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కోసారి కూలి పనులు కూడా వదులుకోవాల్సి వస్తుంది. ఆసరాలేని వృద్ధులు, దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందులు పడతారు. అందువల్ల ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించాలి. దీనివల్ల వాహన డ్రైవర్లకూ ఉపాధి లభిస్తుంది. ఎందరికో మేలు జరుగుతుంది. – ప్రసాద్, జగరాజుపల్లి

ఇసుక రీచ్ ఏర్పాటుకు పరిశీలన



చిన్నచిగుళ్లరేవు సమీపంలో చిత్రావతి నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

తాడిమర్రి: మండలంలోని చిన్నచిగుళ్లరేవు (సీసీ రేవు) సమీపంలో చిత్రావతి నది పక్కన ఇసుక రీచ్ ఏర్పాటు కోసం శుక్రవారం కలెక్టర్ టీఎస్ చేతన్ స్థలాన్ని పరిశీలించారు. జిల్లా భూగర్భ శాఖ ఏడీ రామ్మోహన్ రావు, ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిలతో కలిసి సీసీరేవుకు వచ్చిన కలెక్టర్...నేరుగా చిత్రావతి నది వద్దకు వెళ్లారు. ఇసుక దిబ్బలున్న ప్రాంతాన్ని పరిశీలించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేరే నీటిని రీచ్‌కు ఎంత దూరంలో ఉంటుంది, ఇక్కడ ఎంత మేర ఇసుక లభ్యమయ్యే అవకాశం ఉంది, వర్షాకాలంలో రీచ్ వద్దకు వాహనాల రాకపోకలకు కలిగే ఇబ్బందులు తదితర అంశాలపై నివేదిక తయారు చేసి పంపాలని ఆర్డీఓ వెంకటశివ రామిరెడ్డిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ చేతన్ ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను తనిఖీ చేశారు. ఇసుకను అక్రమంగా తరలించకుండా నిఘా ఉంచాలని ఎస్‌ఐ నాగస్వామి ఆదేశించారు. కలెక్టర్ వెంట సీబీఆర్ ఈఈ రాజశేఖర్ (పులివెందుల), ఇన్‌చార్జి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, రీసర్వే డీటీ మౌనిక, వీఆర్‌ఓ చరణ్ తదితరులు ఉన్నారు.

ఫిడే రేటింగ్‌లో అనంత క్రీడాకారులకు చోటు

అనంతపురం: ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన క్రీడాకారుల జాబితాలో అనంతపురం జిల్లా క్రీడాకారులకు చోటు దక్కింది. ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్ విభాగంలో అనన్య గండికోట 1634 రేటింగ్, ఆదిత్యరెడ్డి 1474 రేటింగ్, జమ్మిరుల్ మిస్బా 1451 రేటింగ్, మొయిన్ అహ్మద్ 1434 రేటింగ్, ఇంటర్నేషనల్ ఫిడే బ్లిట్జ్ రేటింగ్ విభాగంలో జొన్నలగడ్డ నితీష్ చౌదరి 1425 రేటింగ్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే గుంతకల్లుకు చెందిన అనిల్‌కుమార్ 41 సంవత్సరాల వయస్సులో ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్ విభాగంలో 1553 రేటింగ్‌ను సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను చెస్ అసోసియేషన్ కార్యదర్శి అభినందించారు.

మంత్రి సవిత ప్రోద్బలంతోనే దాడులు



బాధితులతో కలసి ఎస్పీ రత్నకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

- పెనుకొండ నియోజకవర్గంలో పెచ్చుమీరిన టీడీపీ నేతల దౌర్జన్యాలు
- దాడులు జరిగి 15 రోజులు గడుస్తున్నా కేసులు నమోదు చేయని పోలీసులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధితులతో కలసి పుట్టపర్తిలో జిల్లా ఎస్పీ రత్నకు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం, పెనుకొండ, పరిగి, సోమందేపల్లి మండలాల్లో ఇప్పటికీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. పార్టీ సానుభూతిపరులైన హరి, మనోహర్, సుమలతలపై గత నెల 15న టీడీపీ వారు దాడులు చేశారన్నారు. అలాగే సోమందేపల్లి మండలంలో లక్ష్మీనారాయణరెడ్డి అనే రైతు పొలంలో వ్యవసాయ పరికరాలు ధ్వంసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను చంపుతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దీంతో కొంత మంది గ్రామాలు విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయడం లేదన్నారు. మంత్రి సవిత కేసులు నమోదు చేయవద్దని చెప్పారని, అవసరమైతే వైఎస్సార్ సీపీ నేతలపై కేసులు కడతామని బెదిరిస్తున్నారన్నారు.

పైశాచికానందం పొందుతున్న మంత్రి..

కులం పేరు చెప్పుకుని ఓట్లు వేయించుకున్న సవిత... ఇప్పుడు కురుబ మహిళ సుమలతకు కూడా న్యాయం చేయలేకపోయారని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. పైగా దాడులు ప్రోత్సహిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకే న్యాయం చేయలేని మంత్రి..ఇక రాష్ట్ర ప్రజలకు ఎంతవరకు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీని దెబ్బతీయాలన్న ఉద్దేశంతో మంత్రి ఇలా దాడులను ప్రోత్సహిస్తున్నారన్నారు. వారి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, దీటుగా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అవసరమైతే రోడ్లపైకి వచ్చి ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు.

అనంతలో కీచక కరస్పాండెంట్

- మనవరాలి వయసున్న బాలికపై అత్యాచారం
- కరస్పాండెంట్ చేష్టలను పిన్నికి ఫోన్‌లో తెలిపిన విద్యార్థిని
- లిటిల్‌ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులుపై పోక్సో కేసు



లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌ను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ నాల్గో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. సమాజంలో ఇన్నాళ్లూ పెద్ద మనిషిగా చలామణి అయిన 73 ఏళ్ల ఇతను మనవరాలి వయసు ఉన్న చిన్నారికి మాయమాటలు చెప్పి అకృత్యానికి ఒడిగట్టాడు. అమానుష ఘటనకు సంబంధించి బాధితురాలి కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాధిత చిన్నారి తల్లిదండ్రులు ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన వారు. బతుకుదెరువు కోసం దుబాయిలో ఉంటున్నారు. దీంతో పిన్ని సంరక్షణలో చిన్నారి ఉంటోంది. రెండు నెలల క్రితం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నాల్గో తరగతిలో చేర్పించి.. హాస్టళ్లో ఉంచారు. కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ గత శని, ఆదివారం రెండు దఫాలు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు చిన్నారి తన పిన్నికి ఫోన్‌లో తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫోన్ సంభాషణను పోలీసులకు అప్పగించారు. 'నగ్నంగా మీద పడుకోవాలని సార్ (ఆంజనేయులు గౌడ్) అంటుంటాడు. క్లాస్‌కు వెళ్లాలి.. సార్ కొడతారని చెప్పినా వినకుండా నన్ను అలా చేశారు. ఒకసారి డబ్బులు కూడా ఇచ్చాడు. అవి పెట్టెలో పెట్టి తాళం వేయడం మరచిపోయాను. దీంతో డబ్బులు ఎవరో తీసుకున్నార'ని అమాయకంగా వివరించింది. ఈ మాటలు విన్న పిన్ని, బాబాయ్ బోరున విలపిస్తూ శుక్రవారం ఉదయమే పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న కరస్పాండెంట్‌ను నిలదీశారు. ఇంతలోనే విద్యార్థి సంఘాల నాయకులకు విషయం తెలియడంతో వారు కూడా వచ్చి కరస్పాండెంట్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతన్ని టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఆంజనేయులు గౌడ్ నుంచి కీలక విషయాలను రాబట్టారు. అత్యాచారం జరిగినట్లు స్పష్టమైందని, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో చిన్నారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా అఘాయిత్యానికి పాల్పడిన పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌ను కఠినంగా శిక్షించాలని చిన్నారి పిన్ని డిమాండ్ చేశారు. పాప ఫోన్‌లో విషయం చెప్పడంతో తాము పాఠశాల వద్దకు వచ్చామని, పాప ఏడుస్తూనే జరిగిన విషయం చెప్పిందన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితురాలి బంధువులు

టీడీపీ నాయకుల అండ..

కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌కు మద్దతుగా టీడీపీకి చెందిన కొందరు నాయకులు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. అభం శుభం తెలియని విద్యార్థినిపై అఘాయిత్యం జరిగితే ఖండించాల్సింది పోయి.. కీచక కరస్పాండెంట్‌కు అనుకూలంగా పోస్టింగ్‌లు పెట్టడం గమనార్హం. వారి తీరును సామాన్య ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

తూమకుంటలో దారుణం

- ఏడేళ్ల బాలికను హత్య చేసి పెన్నానదిలో పాతి పెట్టిన పెదనాన్న
- నిందితుడు గతంలో రెండు హత్య కేసుల్లో ముద్దాయి



బాలిక మృతదేహం



పెన్నా నదిలో బాలిక మృతదేహం పూడ్చిన చోటును పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది

హిందూపురం అర్బన్: అభం శుభం తెలియని ఏడేళ్ల బాలికను వరుసకు పెదనాన్న అయిన వ్యక్తి హతమార్చాడు. సమీపంలోని పెన్నా నది ఇసుక మేటల్లో మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ఈ దారుణ ఘటన శుక్రవారం హిందూపురం మండలం తూమకుంట ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వి.రత్న శుక్రవారం రాత్రి అడిషనల్ ఎస్పీ విష్ణుతో కలసి హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. తూమకుంట ఎస్సీ కాలనీకి చెందిన మహిళను పరిగి మండలం బీచగానపల్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది. సదరు మహిళ మళ్లీ గర్భం దాల్చింది. అక్క, బావ గంగాధర్ తూమకుంట ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రసవం సమయంలో అక్క తోడుగా ఉంటుందనే ఉద్దేశంతో సదరు మహిళ.. అక్క ఇంటికి వచ్చింది. గర్భంతో ఉన్న తల్లిని చూసేందుకు మూడు రోజుల క్రితం ఏడేళ్ల కుమార్తె తూమకుంటకు వచ్చింది. వరుసకు పెదనాన్న అయిన గంగాధర్ శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో బాలికను పొలానికి తీసుకెళ్లాడు. తర్వాత ఒక్కడే ఇంటికి తిరిగి వచ్చాడు. అతన్ని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో బాలిక తల్లి అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే కాలనీకి చేరుకున్న సీఐ వై. శ్రీనివాసులు, సిబ్బంది బాలిక పెదనాన్న గంగాధర్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. తనే బాలికను చంపి పెన్నానది ఇసుక మేటల్లో పూడ్చినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతన్ని వెంట తీసుకొని సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం నిందితున్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. అతను బాలికను అత్యాచారం చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలితే పోక్సో కేసు కూడా నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వి.రత్న, అదనపు ఎస్పీ విష్ణు

గతంలోనూ రెండు హత్యలు..

బాలికను హతమార్చిన గంగాధర్ గతంలోనూ రెండు హత్యలు చేశాడు. 2012లో పరిగి మండలం శాసన కోటకు చెందిన నాగరత్న అనే యువతి తూమకుంటలో జాతరకు రాగా అప్పట్లో గంగాధర్ హత్య చేశాడు. అలాగే 2020 సంవత్సరంలో తూమకుంటకే చెందిన బోయ హనుమక్క (70)అనే వృద్ధురాలిని హతమార్చాడు. ఈ కేసులో శిక్ష అనుభవిస్తూ ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



విద్యుద్దీపాల వెలుగులో కాంతులీనుతున్న తుంగభద్ర జలాశయం

బొమ్మనహళ్: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 1,90,653 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో నమోదైంది. 33 గేట్లలో 28 గేట్లను నాలుగు అడుగులు, మిగతా 5 గేట్లను ఒక్కటిన్నర అడుగు మేర పైకి ఎత్తి నీటిని నదికి విడుదల చేశారు. అవుట్ ఫ్లో నదికి, కాలువలకు వదిలే నీటితో కలిపి 1,82,160 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1,633 అడుగులతో 105.788 టీఎంసీలు ఉండగా.. శుక్రవారం సాయంత్రం నాటికి 1631.29 అడుగులతో 99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలో మీటర్ వద్ద 1,139 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

క్లుప్తంగా

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

బత్తలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... తాడిమర్రి మండలం చిన్నచిగుళ్ల రేవు, బత్తలపల్లి మండలం గరిశలపల్లి సమీపంలోని చిత్రావతి నది నుంచి శుక్రవారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు వెంటనే తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని, తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి సిఫారసు చేశారు. కాగా, ట్రాక్టర్‌కు ఇసుక నింపేందుకు కొందరు వ్యక్తులు బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్నారని, ట్రాక్టర్‌తో పాటు కూలీలను పిలుచుకెళితే వెనక్కు పంపుతున్నారని ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్లు వాపోయారు. ముందుగా అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

రైతుపై ఎలుగుబంటి దాడి



సంజీవప్ప తలకు గాయమైన దృశ్యం

పావగడ: తాలూకాలోని పెమ్మనహళ్లి గ్రామంలో ఎలుగుబంటి దాడిలో రైతు సంజీవప్ప తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం ఉదయం తన తోట వద్దకు వెళుతున్న సంజీవప్పపై సమీపంలోని పొదల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి దాడి చేసింది. ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు అక్కడకు చేరుకుని కేకలు వేసి ఎలుగుబంటిని అదిలించడంతో పొలాల్లోకి పారిపోయింది. అప్పటికే తలకు బలమైన గాయమైన సంజీవప్పను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

అమ్మపాలే శ్రీరామరక్ష

- ముర్రుపాలతో చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెంపు



పుట్టపర్తి అర్బన్ హెల్త్ సెంటర్‌లో తల్లి పాల విశిష్టతపై మహిళలను చైతన్య పరుస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది

ప్రశాంతి నిలయం: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష అని వైద్య నిపుణులు అంటున్నారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక, శారీరకంగా దృఢంగా ఎదిగేందుకు అమ్మపాలు అమృతంలా పనిచేస్తాయని వివరిస్తున్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శిశువులకు అమ్మపాల ఆవశ్యకతపై తల్లులను చైతన్యపరుస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

అపోహలు వీడితే బంగారు భవిష్యత్తు..

చంటి బిడ్డలకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా సంపూర్ణ పోషకాలు అందుతాయి. శిశువులు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారు. అందుకే పుట్టిన ప్రతి బిడ్డకూ ముర్రుపాలు పట్టాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల నవజాత శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అంటున్నారు. అయితే నేటి ఆధునిక ప్రపంచంలో చాలా మంది ఈ విషయాన్ని గ్రహించక తమ బిడ్డలకు పాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. బయటి పాలు పట్టడంతో శిశువుల్లో శారీరక ఎదగదల నశిస్తోంది. అపోహలు వీడి చంటి బిడ్డలకు అమ్మ పాలు ఇవ్వడం ద్వారా అటు శిశువుతో పాటు ఇటు తల్లి ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,824 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 11,233 మంది బాలింతలు, 11,738 గర్భిణులు ఉన్నారు. వీరందరికీ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అమ్మ పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 7వ తేదీ వరకూ ఈ ప్రత్యేక కార్యాచరణ కొనసాగనుంది. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రు పాలను ఎందుకు పట్టించాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. శిశువుకు ఆరు నెలల పాటు తల్లి పాలు తాగిస్తే బిడ్డకు సులభంగా జీర్ణమవడంతో పాటు, శ్వాసకోశ, చర్మవ్యాధులు సోకకుండా ఉంటాయని వివరిస్తున్నారు.

బాధ్యతగా స్వీకరించాలి



బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ప్రతి తల్లీ తన బాధ్యతగా స్వీకరించాలి. శిశువుకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వయస్సు వచ్చేవరకూ తల్లి పాలు పట్టించాలి. ఈ నెల 7వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా తల్లి పాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులను చైతన్యపరుస్తున్నాం.

– ఎం.నాగమల్లేశ్వరి, ఐసీడీఎస్ పీడీ

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లి పాలు తాగిస్తే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతుంది. కొన్ని అపోహలు, మూఢ నమ్మకాలతో తల్లి పాలు ఇచ్చేందుకు కొందరు ఆసక్తి చూపడం లేదు. దీని వల్ల భవిష్యత్తులో తల్లుల్లో చాలా అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముంది.

– డాక్టర్.మంజువాణి, డీఎంహెచ్ఓ

కేజీబీవీలో వంట మనిషి ఆత్మహత్యాయత్నం

నల్లమాడ: స్థానిక కస్తూరిబా గురుకుల (కేజీబీవీ) పాఠశాలలో వంట మనిషి (హెడ్ కుక్)గా పని చేస్తున్న లక్ష్మి శుక్రవారం పాఠశాలలోనే గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, తోటి వంట మనుషులు, విద్యార్థినులు హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న డీఈఓ మీనాక్షి అదే రోజు సాయంత్రం కేజీబీవీని చేరుకుని విచారణ చేపట్టారు. లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కారణాలను ఎస్ఓ రమాదేవి, అకౌంటెంట్ మంజులతో ఆరా తీశారు. లక్ష్మి, మంజుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుందని, దీంతో మనస్తాపం చెందిన ఆమె మాత్రలు మింగినట్లు నిర్ధారణ కావడంతో ఎస్ఓ, అకౌంటెంట్‌ను డీఈఓ మందలించారు. శనివారం (నేడు) విధులు ముగించుకున్న అనంతరం నలుగురు వంట మనుషులతో పాటు కొత్తచెరువులోని తన కార్యాలయంలో సమగ్ర విచారణకు హాజరు కావాలని డీఈఓ ఆదేశించినట్లు తెలిసింది. డీఈఓ వెంట ఎంఈఓ వేమనారాయణ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా... రైతు మృతి

తనకల్లు: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం డి.చెక్కవారిపల్లికి చెందిన రామకృష్ణ (47)కు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న పొలంలో వరి, ఇతర పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసేందుకు సిద్ధమైన ఆయన శుక్రవారం ఉదయం పొలంలో దుక్కి పనులు చేస్తున్న సమయంలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. ఘటనలో ట్రాక్టర్ కింద చిక్కుకున్న ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుత్తి రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామానికి చెందిన కురుబ వీరేష్ (30) సెంట్రింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పామిడిలోని భార్య రేణుకమ్మ బంధువులతో కలసి భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం వ్యక్తిగత పనిపై పెద్దతుంబలం వెళ్లిన ఆయన శుక్రవారం ఉదయం పామిడికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. గుత్తి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే వీరేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో, లారీ ఢీ... ఇద్దరు కూలీల మృతి

- 14 మందికి గాయాలు
- వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఘటన



లోయలో పడిన ఆటో



నాగమ్మ (ఫైల్)



కదిరమ్మ (ఫైల్)

పులివెందుల రూరల్/తలుపుల: వారంతా కూలీలు... రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు... జానెడు పొట్ట నింపుకునేందుకు కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తున్న వారిని లారీ మృత్యువు రూపంలో కబళించింది. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా పులివెందుల–కదిరి ప్రధాన రహదారిపై జరిగింది. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, 14మంది గాయపడ్డారు. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా, బట్రేపల్లి నుంచి 16 మంది ఆటోలో పులివెందులకు కూలి పనుల కోసం బయలుదేరారు. పులివెందుల–కదిరి ప్రధాన రహదారి డంపింగ్ యార్డ్ సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న సిమెంట్ లారీ ఆటోను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి నాగమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందగా, కదిరమ్మ, లక్ష్మీదేవి, రమణమ్మ, అనూష, ఈశ్వరమ్మ, రత్నమ్మ, శకుంతల, వెంకట లక్ష్మమ్మ, శైలు, రమాదేవి, నాగమ్మలతోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ ఆంజనేయులు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స కోసం పులివెందుల ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. వారిలో చికిత్స పొందుతూ కదిరమ్మ (38) మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మహిళా ఉద్యోగికి బెదిరింపు

నల్లచెరువు: మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ఉద్యోగికి తాను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యన్న (సత్యకుమార్) పీఏ తమ్ముడినంటూ ఓ ఆగంతకుడు ఫోన్ చేసి బెదిరించాడు. నల్లచెరువులో ఓ ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తున్న తన బంధువైన ఆర్ఎంపీ జోలికి వెళితే బాగుండదంటూ గురువారం రాత్రి మహిళా ఉద్యోగికి దుండగుడు ఫోన్ చేసి బెదిరించిన ఆడియో సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే బెదిరింపులకు పాల్పడింది టీడీపీకి చెందిన నేతనే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఉద్యోగులు ప్రశాంతంగా విధులు నిర్వర్తించలేకపోతున్నారని పలువురు విమర్శించారు. మహిళా ఉద్యోగిని బెదిరించిన దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మామిడి మొక్కల నరికివేత

ధర్మవరం రూరల్: మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన రైతు రామ్మోహన్‌రెడ్డి పొలంలో 250 మామిడి మొక్కలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో 300 మామిడి మొక్కలను రెండేళ్ల క్రితం రైతు నాటాడు. మొక్కలు ఏపుగా పెరుగుతున్న దశలో 250 మొక్కలను దుండగులు నరికివేశారు. తనకు ఎవరితోనూ విభేదాలు లేవని, ఈ దురాగతానికి పాల్పడింది ఎవరో తనకు తెలియదని బాధిత రైతు వాపోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమ బస్సు ఢీకొని ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లా లూసర్ గ్రామానికి చెందిన సాహెల్ కొన్నేళ్ల క్రితం వలస వచ్చి గుట్టూరు సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన సోదరుడి కుమారుడు అక్రమ్ (15) కూడా బాబాయ్‌కి తోడుగా ఉంటూ వచ్చాడు. శుక్రవారం ఉదయం హోటల్ నుంచి వాటర్ బాటిళ్లు తీసుకుని రోడ్డు దాటుతున్న అక్రమ్‌ను అనంతపురం వైపు నుంచి కార్మికులతో వస్తున్న కియా అనుబంధ పరిశ్రమకు చెందిన పిఆర్ఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఘటనలో అక్రమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కియా ఎస్ఐ రంగడు యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నేటి నుంచి నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

అనంతపురం: నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో శనివారం ప్రారంభం కానున్నాయి. జూనియర్ గర్ల్స్ టైర్-1 పోటీలతో టోర్నీ ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జార్ఖండ్- ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుందని పేర్కొన్నారు. టీం -బీలో బిహార్- హిమాచల్ ప్రదేశ్ జట్లు పోటీపడతాయని తెలిపారు.

పింఛన్‌దారులపై 'పచ్చ'కక్ష

- రామగిరి మండలంలో 250 మందికి ఎగనామం
- టీడీపీ నేతల ఆదేశాలతో పింఛన్ సొమ్ము ఇవ్వని అధికారులు
- సచివాలయం ఎదుట ఆందోళనకు దిగిన లబ్ధిదారులు



పెద్దకొండాపురం సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

రామగిరి: ఏ ఆసరా లేని వారికిచ్చే సామాజిక భద్రత పింఛన్లనూ టీడీపీ నేతలు రాజకీయ రంగు పూశారు. అధికారం అండతో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ అందకుండా అధికారులకు ఆదేశాలిచ్చి పైశాచిక ఆనందం పొందుతున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులన్న ముద్ర వేసి సొమ్ము అందకుండా చేస్తున్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో ఈ దుర్మార్గకాండ సాగుతుండగా...పింఛన్ అందని వారంతా సచివాలయాల వద్ద ఆందోళనకు దిగారు.

జాబితాలో పేరు లేదంటూ...

వరుసగా రెండు నెలలు పింఛన్ సొమ్ము తీసుకోకపోతే పింఛన్ జాబితా నుంచి సదరు లబ్ధిదారుల పేర్లు పూర్తిగా తొలగించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈక్రమంలోనే పింఛన్ పంపిణీకి ఒక్క రోజే గడువు ఇచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకున్న టీడీపీ నేతలు అధికార దర్పంతో అమాయకులను ఇబ్బందులు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూలైలో తొలిసారి పింఛన్లు పంపిణీ చేయగా..రామగిరి మండలంలోని పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి తదితర పంచాయతీల్లో చాలా మందికి పింఛన్ ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో లబ్ధిదారులంతా రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిరిగారు. కానీ ఫలితం లేకపోయింది. తాజాగా ఆగస్టు నెల పింఛన్ అయినా అందుతుందన్న ఆశతో 1వ తేదీ సచివాలయాల వద్దకు వెళితే జాబితాలో పేరులేదంటూ సిబ్బంది తెలిపారు. ఈ నెలలో దాదాపు 250 మంది పింఛన్‌దారులకు సొమ్ము అందలేదు. దీంతో వారంతా శుక్రవారం సచివాలయాల వద్ద ఆందోళనకు దిగారు. పింఛన్‌కు అర్హత ఉండి, ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న తమకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించినా.. ఎవరూ సమాధానం చెప్పడం లేదు. సచివాలయ ఉద్యోగులను గట్టిగా నిలదీస్తే టీడీపీ నేతలను కలవాలని చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పింఛన్‌దారులు టీడీపీ నేతలను కలిసినా ''మీరు మా పార్టీ కాదు. అందుకే మీ పింఛన్ ఇవ్వం'' అని చెప్పారని వాపోయారు. అధికారులు స్పందించి అర్హులమైన తమకు పింఛన్ ఇప్పించాలని కోరుతున్నారు.

పోస్టర్ డిజైనింగ్ పోటీలకు ఆహ్వానం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగే పోస్టర్ డిజైన్ పోటీలకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముద్రించిన పోస్టర్లను జిల్లా పర్యాటక శాఖ అధికారులతో కలసి శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ విడుదల చేసి, మాట్లాడారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ సృజనాత్మకతను చాటేలా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పోస్టర్లను డిజైన్ చేసి ఈ నెల 5వ తేదీలోపు పూర్తి వివరాలతో http://forms.gle/yambxtfvnb4uozah8 గుగూల్ లింక్ ద్వారా పంపాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్, సీపీఓ విజయ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, ప్రతాపరెడ్డి, సంక్షేమ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం ఆనందంగా గడపండి

- ఎస్పీ రత్న



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ రత్న, తదితరులు

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు శ్రమించి ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో విశ్రాంత జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఏఆర్ ఏఎస్ఐలు సుంకన్న, నీలకంఠ, నరసింహులుకు ఎస్పీ రత్న సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులకు శుక్రవారం డీపీఓలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్ష, సైబర్ క్రైమ్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

300 గుంజీలు తీయించిన పీఈటీ



కాళ్లు వాచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి హరూన్‌బాషా

హిందూపురం: లేపాక్షిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల పీఈటీ నిర్వాకంతో ఓ విద్యార్థి తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. వివరాలు... చిలమత్తూరుకు చెందిన సిద్దిక్ బాషా తన కుమారుడు హరూన్‌బాషాను గత నెల 29న లేపాక్షిలోని ఎంజేపీ పాఠశాలలో 9వ తరగతిలో చేర్పించాడు. ఈ క్రమంలో హరూన్‌బాషా ఎలాంటి తప్పిదం చేయకపోయినా గురువారం 300 గుంజీలను పీఈటీ సందీప్ తీయించారు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న సిద్దిక్‌బాషా... పాఠశాల వద్దకెళ్లి కుమారుడుని చికిత్స కోసం ఇంటికి పిలుచుకెళ్లాడు. ఇంటికి చేరుకున్న తర్వాత తనతో పీఈటీ 300 గుంజీలు తీయించాడని, దీంతో కాళ్లు విపరీతంగా నొప్పిస్తున్నాయంటూ హరూన్‌బాషా బోరున విలపించడంతో వెంటనే ఆస్పత్రికి పిలుచుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు... నొప్పి కారణంగా తీవ్ర జ్వరంతో హరూన్‌బాషా బాధపడుతున్నట్లుగా నిర్ధారించి చికిత్స అందజేశారు. ప్రస్తుతం బాలుడు ఇంటి పట్టునే కోలుకుంటున్నట్లు తండ్రి తెలిపాడు. కాగా, తమ కుమారుడి పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన పీఈటీపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బాధిత విద్యార్థి తండ్రి కోరారు.

జిల్లాకే గర్వకారణం బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ పురస్కారాలు అందుకున్న సీనియర్ కళాకారులు

అనంతపురం కల్చరల్: తన అద్వితీయమైన నటనతో ప్రజానీకాన్ని ఆకట్టుకున్న బళ్లారి రాఘవ అనంత జిల్లా వాసి కావడం ఎంతో గర్వంగా ఉందని వక్తలు కొనియాడారు. బళ్లారి రాఘవ 144వ జయంతి సందర్భంగా అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో శుక్రవారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య సుధాకరబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌నారాయణ, రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ, సీనియర్ నటులు సంగాల నారాయణస్వామి, సోమిరెడ్డి, రామగోవిందు తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి బళ్లారి రాఘవ ఆదర్శప్రాయ జీవితాన్ని వివరించారు. అనంతరం బళ్లారి రాఘవ రాష్ట్ర, జిల్లా స్థాయి పురస్కారాలను సీనియర్ రచయితలు మార్తాటి ఈశ్వరీగోపాలరావు, కులశేఖర్, సంజీవరెడ్డి, దయానంద్‌కు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యనిర్వాహక సభ్యులు ఆదినారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కుళ్లాయప్ప, మల్లికార్జున, అస్లామ్, లోకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారిని చితకబాదిన టీచర్

- వాతలు పడేటట్లు కొట్టిన వైనం
- జీనియస్ ప్లేహోం స్కూల్‌లో ఘటన
- సీసీ టీవీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్



జీనియస్ ప్లేహోం టీచర్ కొట్టడంతో చిన్నారికి గాయాలైన దృశ్యం

ధర్మవరం: పెన్సిల్ అడిగాడన్న కోపంతో ఓ ఎల్కేజీ విద్యార్థిని టీచర్ చితకబాదారు. కర్రతో వాతలు పడేటట్లు కొట్టారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీన్ని చూసిన జనం.. అభం శుభం తెలియని చిన్నారిని దారుణంగా కొట్టడం నేరమని, అధికారులు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఘటన ఎప్పుడు జరిగిందనే విషయం తెలియరాలేదు. సీసీ టీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా పట్టణంలోని జీనియస్ ప్లే హోం స్కూల్‌లో ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దీంతో పాఠశాల యాజమాన్య ప్రతినిధి ప్రేమ్ కిషోర్‌ను 'సాక్షి' వివరణ కోరగా... ఈ ఘటన 2022లో తమ పాఠశాలలోనే జరిగిన విషయం వాస్తవమేనని, చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనిత అనే టీచర్‌ను విధుల నుండి తొలగించామన్నారు. తాజాగా ఎవరో ఉద్దేశ పూర్వకంగా సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేస్తున్నారన్నారు. పాఠశాలలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు.